• బ్యాంకు మేనేజర్‌పై రైతుల మండిపాటు



కొత్త వ్యవసాయ రుణాల మంజూరులో బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్యంపై రైతులు మండిపడ్డారు. నారాయణపేట జిల్లా ఊట్కూరు ఎస్‌బీఐకి రైతులు నెల రోజులుగా కొత్త రుణాల కోసం తిరుగుతున్నారు. విసుగుచెందిన రైతులు సోమవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చి మేనేజర్ ప్రవీణ్ మోజేశ్‌ను నిలదీశారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో వాదనకు దిగారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణంరాజు వచ్చి రైతులను సముదాయించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. – ఊట్కూర్

• రుణమాఫీపై రైతుల ఆందోళన



రుణమాఫీ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్ల పీఏసీఎస్ ఎదుట సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మూడు విడతల్లో రుణమాఫీ డబ్బులు వచ్చినా ఏ ఒక్క రైతుకు కూడా మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ కాని రైతుల గురించి పట్టించుకోవడం లేదని వారు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. – భువనగిరి కలెక్టరేట్



జనగామ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, రైతులు

## రుణమాఫీ కాని రైతులతో కలెక్టరేట్‌కు ఎర్రబెల్లి

### కలెక్టర్‌కు వినతిపత్రం

జనగామ, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ కాని రైతులతో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం జనగామ కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని రుణమాఫీ కాని రైతులతో కలిసి ఊరేగింపుగా చేరుకున్నారు. ఆందోళన చేపట్టేందుకు వచ్చినట్టు భావించిన పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వినతిపత్రం కోసం వెళ్తున్నట్టు చెప్పగానే లోనికి అనుమతించారు. నాలుగు మండలాలకు చెందిన రైతులతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. అలాగే తన నియోజకవర్గ పరిధిలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించి చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను కొనసాగించి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. బయటకు వచ్చిన తరువాత ఎర్రబెల్లి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణ మాఫీని పూర్తి స్థాయిలో నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. రైతుల పక్షాన ఉద్యమించి సర్కారు మెడలు వంచుతామని స్పష్టం చేశారు. దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లో ఇప్పటివరకు కేవలం 40 శాతం రైతులకు మాత్రమే రుణ మాఫీ జరిగిందని అన్నారు. రుణమాఫీ హామీని సంపూర్ణంగా అమలు చేయకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే సిద్దిపేట జిల్లాలో రుణ మాఫీ కాని రైతు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు.

• మిడ్జిల్‌లో పాడి రైతుల ధర్నా



పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు నిరసన తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. విజయ డెయిరీకి పాలు విక్రయిస్తున్నా రెండు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. – మిడ్జిల్

# ఫార్మాసిటీ బాధితుల ధర్నా

- రెండుగంటలపాటు కొనసాగిన ఆందోళన
- కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్
- బాసటగా నిలిచిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- ఫార్మాసిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్



సంగారెడ్డిలో కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

సంగారెడ్డి, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాసిటీని వ్యతిరేకిస్తూ బాధిత రైతులు కదం తొక్కారు. నిన్న మొన్నటివరకు స్థానికంగా ఆందోళనలకు దిగిన రైతులు సోమవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. న్యాల్‌కల్ మండలంలోని డప్పూరు, మాల్గి, వడ్డీ గ్రామాల రైతులు పెద్దఎత్తున తరలివచ్చి బైఠాయించారు. వీరి ఆందోళనకు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావుతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా రైతులు పెద్దపెట్టున నినదించారు. కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తున్న రైతులను పోలీసులు అడ్డగించడంతో అక్కడే బైఠాయించారు. కలెక్టరే తమవద్దకు రావాలంటూ డిమాండ్ చేశారు. రెండు గంటలకుపైగా ధర్నా కొనసాగింది. కలెక్టరేట్ ఏవో, డీఎస్పీ, ఇతర అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు కదలలేదు. దీంతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ స్వయంగా రైతుల వద్దకు వచ్చారు. న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటును రద్దు చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు, రైతులు కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. భూసేకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ రైతులతో మాట్లాడుతూ.. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

### ఫార్మాసిటీని రద్దు చేయాల్సిందే: ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటుతో పెద్ద ఎత్తున రైతులు భూములు కోల్పోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ ఏర్పాటు వల్ల కాలుష్యం తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం దిగిరాకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ రైతులు ఎస్పీ రూపేష్‌ను కలిసి న్యాల్‌కల్‌లో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు చేపడతామని, అందుకు సహకరించాలని కోరారు.

## ఇండ్ల దరఖాస్తులు కుప్పలు తెప్పలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ ) : హైదరాబాద్ కలెక్టరేట్‌కు ఇండ్ల దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. దరఖాస్తులను భద్రపర్చటానికి ట్రంక్ పెట్టెలు సరిపోవడం లేదని వాపోతున్నారు. ప్రజావాణిలో 150 దరఖాస్తులు వస్తే, 110 ఇండ్ల దరఖాస్తులే ఉంటున్నాయని చెబుతున్నారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజలు తమకు పథకాలు వర్తించడం లేదని దరఖాస్తులు ఇస్తున్నారు. తమ సమాచారాన్ని తిరిగి పొందుపర్చుకునేందుకు కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. అటు ఇండ్ల దరఖాస్తుదారులు, అటు ఆరు గ్యారంటీల అప్‌డేట్ కోసం వచ్చే వారితో కలెక్టరేట్ కోలాహలంగా మారింది.

## గ్రీన్ ఫార్మాసిటీ పనులు వేగవంతం

- పరిశోధన, శిక్షణ, నైపుణ్యాల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయం
- త్వరలో ఔషధ కంపెనీలతో సంప్రదింపులు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లలో అభివృద్ధి చేయతలపెట్టిన గ్రీన్ ఫార్మాసిటీ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని ముచ్చర్ల ప్రాంతంలో చేపట్టనున్న గ్రీన్ ఫార్మాసిటీ ప్రణాళికలపై సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి అధికారులతో చర్చించారు. పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల అభివృద్ధి జరగాలని, పర్యావరణహితంగా, కాలుష్యరహితంగా ఉండేలా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలను త్వరగా కల్పించాలని చెప్పారు. గ్రీన్‌ఫార్మా సిటీలో పెట్టుబడులకు ఇప్పటికే పేరొందిన ఔషధ కంపెనీలు ముందుకొస్తున్నాయని, త్వరలోనే ఆ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతామని తెలిపారు. ఔషధాల తయారీతోపాటు పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తామని తెలిపారు. హెల్త్ కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



గద్వాల అర్బన్ గురుకుల పాఠశాల ఆవరణలోని ప్రైవేటు బోరు వద్ద నీటి కోసం బకెట్లతో బారులుదీరిన విద్యార్థులు

# విద్యార్థుల క'న్నీటి' కష్టాలు

**గద్వాల గురుకులంలో 15 రోజులుగా పనిచేయని బోరు**

- అధికారులకు చెప్పినా స్పందించని వైనం
- బకెట్లు తీసుకొని బయటకు పరుగులు
- బాత్‌రూమ్‌లు సరిపోక ఆరుబయటే స్నానాలు

గద్వాల, సెప్టెంబర్ 9 : అనాథలు, బాల కార్మికులకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న అర్బన్ గురుకుల పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఉన్న ఈ గురుకులంలో 4 నుంచి 8వ తరగతి వరకు ఉండగా.. 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న బోరు 20 రోజుల కిందట చెడిపోగా.. వార్డెన్ మరమ్మతులు చేయించినా మళ్లీ రెండ్రోజులకే పాడైపోయింది. ఈ విషయాన్ని ఇన్‌చార్జి డీఈవో దృష్టికి తీసుకెళ్లగా.. మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చి పక్షం రోజులైనా స్పందించకపోవడంతో విద్యార్థులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. గురుకులం సమీపంలోనే ప్రైవేటు బోరు ఉండటంతో విద్యార్థులు ఉదయం నిద్ర లేచిందే తడవు నీటికోసం బకెట్లు పట్టుకొని పరుగులు తీస్తున్నారు. దీనికితోడు గురుకులంలో కేవలం రెండు బాత్‌రూంలు మాత్రమే ఉండటంతో సరిపోక ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కష్టాలు తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

## మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

› మొదటిపేజీ తరువాయి...

సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ.. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించపోవడంతో మనస్తాపం చెందాడు. రోజు మాదిరిగా సోమవారం ఆటో తీసుకుని ఇంటి నుంచి బయల్దేరాడు. పోచంపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే దారిలో పిలాయిపల్లి కాల్వ సమీపంలో అటవీ ప్రాంతానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన గ్రామస్థులు నగేశ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి వెళ్లి చూసేసరికి చెట్టుకు వేలాడుతూ విగత జీవిగా కనిపించాడు. మృతుడి భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని భువనగిరి దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు.

## నా భార్య చనిపోయినా పరిష్కారం కాలేదు

- కొడుకుపై గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినం
- స్పందన లేకపోవడంతో మరోసారి వచ్చినం: వృద్ధుడు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): 'పేదరికంలో మగ్గుతున్నాం. నేను కట్టుకున్న ఇంట్లోకి నా కొడుకు రానివ్వడం లేదు. ఈ విషయమై గతంలో భార్యతో కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశాం. తిరిగి కూతురు ఇంటికి వెళ్తుండగా భార్య మృతిచెందింది. అయినా సమస్య పరిష్కారం కాలేదు' అని ఆదిలాబాద్‌లోని క్రాంతినగర్‌కు చెందిన వృద్ధుడు దేవ్‌రావు (82) సోమవారం రెండోసారి ప్రజావాణికి వచ్చాడు. ఈ సందర్భంగా దేవ్‌రావు మాట్లాడుతూ.. క్రాంతినగర్‌లో సొంతిల్లు ఉందని, కుమారుడు గెంటేశాడని, ఈ విషయమై జూలై 15న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు. ఆదిలాబాద్ రూరల్ మండలం అర్లీకి ఆటోలో కూతురు, అల్లుడు వద్దకు వెళ్తుండగా భార్య (80) మరణించింది. మరోసారి ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు కూతురు విమల, అల్లుడు పాండురంగ్‌తో కలిసి వచ్చానని దేవ్‌రావు అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవితో చెప్పాడు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ఆ వృద్ధుడు కోరాడు.

• పెండింగ్ జీతాల కోసం ధర్నా



పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎదుట శానిటేషన్ సిబ్బంది విధులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఏజెన్సీ కింద ప్రభుత్వ దవాఖానలో 28 మంది శానిటేషన్ విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. జీతాలు అడిగితే విధుల నుంచి తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. – కల్వకుర్తి

• బిల్లుల కోసం గ్రామ పంచాయతీకి తాళం



పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజా మాజీ సర్పంచ్ జీపీకి తాళం వేసి నిరసన తెలిపిన ఘటన సోమవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తొగర్రాయిలో చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్ ఓడేటి తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామాభివృద్ధి కోసం రూ.30 లక్షల వరకు వ్యక్తిగతంగా ఖర్చు చేశానని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, అందుకు విసుగుచెంది పంచాయతీ కార్యాలయానికి తాళం వేశానని వాపోయారు. ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్ జీపీకి చేరుకొని విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం తిరుపతిరెడ్డి అధికారులకు వినతి పత్రం అందజేశారు. –దుగ్గొండి

• మంచం పట్టిన గురుకుల పాఠశాల



సిర్పూర్(టీ) సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల–కళాశాల జ్వరాలతో మంచం పట్టింది. 34 మంది విద్యార్థులు జ్వరంతో బాధపడుతుండగా ప్రిన్సిపాల్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను సిర్పూర్(టీ) సామాజిక దవాఖానకు తరలించారు. సబ్ కలెక్టర్, డీఎంహెచ్‌వో మెరుగైన వైద్యమందేలా చూశారు. సోమవారం మరో 8 మందికి జ్వరం రావడంతో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ గురుకులాన్ని సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. చికిత్స తీసుకున్న 26 మంది విద్యార్థుల్లో.. 16 మందిని తల్లిదండ్రులకు అప్పగించారు. 100 మందికిపైగా విద్యార్థులకు జ్వారాలు వచ్చినట్టు తెలుస్తున్నది. డీఎల్‌పీవో, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, మెడికల్ అధికారులు డాక్టర్ నవత, అనూష ఉన్నారు. – సిర్పూర్(టీ)

• అద్దె చెల్లించలేదని గురుకులానికి తాళం




గురుకుల భవనానికి అద్దె చెల్లించడం లేదని యజమాని గేటుకు తాళం వేశాడు. ఈ ఘటన వనపర్తి జిల్లా నాగవరంలో చోటుచేసుకున్నది. పెద్దమందడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాలను నాగవరంలోని ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. ఎనిమిది నెలలకు గాను రూ.60 లక్షల అద్దె బకాయి పడటంతో ఆ భవనం యజమాని తాళం వేశాడు. దీంతో విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు అక్కడే నిరీక్షించారు. త్వరలో బకాయిలు చెల్లిస్తామని ఉన్నతాధికారులు యజమానికి ఫోన్‌లో హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం తర్వాత తాళం తీశాడు. – వనపర్తి టౌన్

## భుజంగరావుపై మరో కేసు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎస్పీ భుజంగరావు మరో కేసులో చిక్కుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కూకట్‌పల్లి సర్వే నంబర్ 1007లో అబ్బాస్ అలీఖాన్ కుటుంబసభ్యులకు సంబంధించి 340 ఎకరాల స్థలంపై వివాదం కొనసాగుతున్నది. కోర్టు పరిధిలో ఉండగానే శ్రీనివాస్, అనిల్, ఎస్‌ఎస్ మోయినుద్దీన్ నకిలీ పత్రాలను సృష్టించి ఆ భూమిని కబ్జా చేశారు. అప్పట్లో కూకట్‌పల్లి ఏసీపీగా పనిచేసిన భుజంగరావు కబ్జాదారుకు వత్తాసు పలకడంతోపాటు తమను బెదిరించినట్టు బాధితులు ఈ నెల 5న సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సీపీ ఆదేశాల మేరకు నిందితులపై ఈవోడబ్ల్యూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, భుజంగరావును నాలుగో నిందితుడిగా చేర్చారు.